


## గీత కార్మికులపై సర్కార్ సవతి తల్లి ప్రేమ


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 03 జులై , 2026 | పేజీలు : 6


# పారిశుధ్య కార్మికుల ప్రాణాలకు రక్షణేదీ

**సుమారు 10 నెలలుగా అందని రక్షణ కిట్లు**

**వర్షాకాలంలో అంటువ్యాధుల ముప్పు మధ్యే విధులు**

**వేతన బకాయిలు... సకాలంలో జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి**

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులే నేడు అసురక్షిత పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు చెత్త, మురుగు మధ్య పనిచేస్తున్న వారికి కనీస రక్షణ సామగ్రి అందడం లేదు. వర్షాకాలంలో అంటువ్యాధుల ముప్పు పెరిగిన నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు వేతనాల చెల్లింపులో జాప్యం కొనసాగుతుండటంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సమాజంలో మనం మనుషులమే కదా? సాటి మనిషి పట్ల కనీస మానవత్వం, జాలి చూపాల్సిన బాధ్యత లేదా? లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల దయనీయ స్థితిని చూస్తుంటే, స్థానిక అధికారుల నిర్లక్ష్యం స్పష్టమవుతోంది. కనీస రక్షణ పరికరాలు అందించకపోవడంపై కార్మికులు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**10నెలలుగా అందని రక్షణ కిట్లు**

నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు 40 వేల మంది జనాభా, 20 వార్డులు, సుమారు 9,300కు పైగా గృహాలు ఉన్నాయి .ఈ పరిధిలో పారిశుధ్య సేవలు అందించెందుకు 69 మంది సానిటరీ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ,మురుగు కాలువల శుభ్రపరచడం, వీధుల పరిశుభ్రత, చెత్త తరలింపు వంటి పనులు నిర్వహిస్తున్నప్పటికీ, వారికి సుమారు 10నెలల కాలంగా రక్షణ కిట్లు అందలేదని సిబ్బంది తెలిపారు.తమ కూడా మనుషులమే కదా,మా ప్రాణాలకు విలువ లేదా అని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




**వర్షాకాలంలో పెరగనున్న ప్రమాదం**

వర్షాకాలం ప్రారంభం కావడంతో చెత్త తడిసి కుళ్లిపోవడం,మురుగు నీరు నిల్వ ఉండటం,ఈగలు, దోమలు పెరగడంతో పారిశుధ్య పనులు మరింత ప్రమాదకరంగా మారాయి. అయినప్పటికీ చేతులకు గ్లౌజులు,కాళ్లకు గమ్ బూట్లు,ముఖానికి మాస్కులు లేకుండానే కార్మికులు పనిచేస్తున్నారు. కొందరు ప్లాస్టిక్ కవర్లను చేతులకు తొడుక్కొని చెత్త సేకరిస్తున్నట్లు తెలిపారు.

**వేతనాల చెల్లింపులో జాప్యం..**

రక్షణ కిట్ల సమస్యతో పాటు వేతనాల చెల్లింపులోనూ జాప్యం కొనసాగుతోందని కార్మికులు తెలిపారు. గతంలో మూడు నెలల వేతనాలు బకాయిగా ఉండగా, ఇటీవల ఒక నెల వేతనం మాత్రమే చెల్లించినట్లు చెప్పారు. ప్రస్తుతం మే, జూన్ నెలల ముగుస్తుండడంతో వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి నెల వేతనాలు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఫైల్ సిద్ధం.. త్వరలో కిట్లు

మున్సిపల్ పాలకవర్గం ఈ సంవత్సరం మే 6 తారీఖున పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పరిపాలన కొనసాగుతోంది. రక్షణ కిట్ల కొనుగోలుకు సంబంధించిన ప్రతిపాదనను ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లి ఫైల్‌ను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమోదం వస్తే కిట్ల కొనుగోలు చేసి పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ తెలిపారు.

## 'కపస్ కాంతి' పథకాన్ని రైతులు సద్వినియోగం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూర్):** కపస్ కాంతి పథకంలో భాగంగా పంపిణీ చేస్తున్న పత్తి విత్తనాలను జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. కట్టంగూరు రైతు వేదికలో గురువారం ఏర్పాటుచేసిన పత్తి విత్తనాల ప్రదర్శన పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ కపస్ కాంతి పథకంలో భాగంగా 19 ప్రముఖ కంపెనీలకు చెందిన లక్ష 65 వేల పత్తి విత్తనాల ప్యాకెట్లు జిల్లాలో సిద్ధంగా ఉన్నాయని, అలాగే వీటితోపాటు సస్యరక్షణ మందులైన వేప నూనె,సూక్ష్మ పోషకాలు,జీవ నియంత్రణ ఎరువులు కూడా రైతులకు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.రెండున్నర ఎకరాలు కలిగిన రైతుకు 5 పత్తి విత్తనాల పాకెట్లను ఉచితంగా అందజేయడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకొని రైతులు అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో నకిరేకల్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి,కట్టంగూరు తహసిల్దార్ పుష్పలత తదితరులు ఉన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని పరిశీలించారు. సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని,ఎక్కడ



ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పూర్తి చేయాలని బి ఎల్ ఓ లను ఆదేశించారు.




## పామాయిల్ పంటలపై మొగ్గు చూపండి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపు

పామాయిల్ సాగు పంటల పరిశీలన



## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన అంగిడి రాజు ఇటీవల మరణించడంతో అనంతారం గ్రామానికి చెందిన యువత ఆధ్వర్యంలో రూ. 21,500లను రాజు కుటుంబానికి గురువారం గ్రామ సర్పంచ్ వినోద్ చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంతో గ్రామ యువత చేస్తున్న కృషి చాలా శుభపరిణామం అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంపత్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

## పిఎసిఎస్‌చైర్మన్‌గా కొప్పుల రాంరెడ్డి బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్‌గా గురువారం కొప్పుల రాంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల, విత్తనాలు, పంట రుణాలు, ఇతర సేవలు అందించేలా కృషి చేస్తానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్‌ను డైరెక్టర్లు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, పత్తేపురం సర్పంచ్ కొనుగంటి సుజాత సోమిరెడ్డి, సంఘ డైరెక్టర్లు దేవులపల్లి శంకరచారి, వేముల జయమ్మ, ప్రాంచీస్, నూకల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఇటీవల వడదెబ్బ కారణంగా మృతి చెందిన హుజూర్‌నగర్‌కు చెందిన శివాజీ నాగవల్లి కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ పదివేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయిన తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## తొలి రోజు 10 నామినేషన్లు దాఖలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ఈనెల 10న జరగనున్న పోచంపల్లి చేనేత సహకార సంఘ ఎన్నికలలో భాగంగా గురువారం నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొదటిరోజు మొత్తం 10 నామినేషన్లు దాఖలు కాగా మహిళా రిజర్వేషన్ కేటగిరీలో రెండు దాఖలైనట్టు ఎన్నికల అధికారి యూసుఫ్ అలీ పేర్కొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** అర్హులందరికి ఓటు హక్కు కల్పించే బాధ్యత బూత్ లెవల్ ఏజెంట్లపై ఉందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ గురువారం మండల కేంద్రంలోని సాయికృప ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ప్రతి ఇంటికి సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంతో ప్రజలకు అవగాహన కల్పించి సహకరించాలని సూచించారు. సర్ పై నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, బిఎల్‌ఏలకు పూర్తిగా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దూదిపాల



శ్రీధర్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ నింపడంలో గందరగోళం



**ప్రజాపక్షం/అనంతగిరి:** మండలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర విచారణలో భాగంగా ఇంటింటికి ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్నారు. కాని గ్రామాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది జూన్ 25న ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ ప్రారంభం కాగా స్వీకరణకు జూలై 24 వరకు గడువు ఉంది. మొదటి వారంలో ఓటర్లందరికి పంపిణీ చేసి మిగతా మూడు వారాల్లో నింపిన ఫారాలు తీసుకోవాలని బిఎల్‌వోలకు ఎన్నికల అధికారుల నుంచి అదేశాలు ఉన్నాయి. అయితే పత్రాలు ఎలా నింపాలో ఓటర్లకు వివరించడంలో పలువురు పోలింగ్ బూత్ అధికారులు అయోమయానికి గురవుతున్నారు. కొంతమంది పత్రాలు తీసుకున్న తర్వాత వాటిని నింపే ప్రక్రీయ ప్రారంభించారు. వాటిని నింపిన తర్వాత బిఎల్‌వోల వద్దకు పారాలు తీసుకుని పోతే నింపిన ఫారాలు తప్పు ఉన్నాయని వారు తిరస్కరించారు. అసలు బిఎల్‌వోలకే వివరం తెలియకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటీ 2002 ఓటర్ కార్డుకు అనుగుణంగా వివరాలు పూరించాలని నిబంధన ఉన్నటువంటి ఓటు గుర్తింపు కార్డులో పేరు చిరునామ తప్పుగా ఉన్న వారు మళ్లీ అదే విధంగా నమోదు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

# విద్యార్థుల సమస్యలపై తహశీల్దార్‌కు వినతి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల మరియు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారించాలని కోరుతూ గురువారం బిజెపి మండల అధ్యక్షులు పింగళి విజయ్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈసందర్భగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహానికి వెంటనే పర్మినెంట్ వార్డెన్‌ను నియమించాలని, గుండాలలోని బిసి బాలుర వసతి గృహానికి ఇంచార్జీ వార్డెన్ స్థానంలో శాశ్వత వార్డెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సీతారంపురం ఎస్సీ బాలల వసతి గృహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసి మోడల్ స్కూల్ విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని, బస్సు సౌకర్యం లేని అంబాల,



వంగాల, నూనెగూడెం గ్రామాలకు వెంటనే బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థులకు, గ్రామ ప్రజలకు రవాణా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వినతి అందజేసిన వారిలో బిజెపి అధికార ప్రతినిధి వివాకర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, సురేష్, సాయి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల పరిధిలోని ఎర్రగట్టుతండా గ్రామ పరిధిలో తండా నుంచి మేళ్లచెరువుకి వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ వైర్లు చాల కిందకు వేలాడుతూ గడ్డిలోడ్‌లతో, ధాన్యం లోడులతో వెళ్తున్న ట్రాక్టర్లకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పట్టించుకొని విద్యుత్ అధికారులు

విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రాణాంతకంగా మారిన కూడా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, కేవలం అధికారుల నిర్లక్ష్యం మాత్రమేనని తండా వాసులు అంటున్నారు. తమ పొలాల గుండా వెళ్లే విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నా ఆ వైర్లను సరిచేయడానికి కూడా చర్యలు చేపట్టడం లేదని, వర్షకాలంలో ఈదురుగాలులకు కొమ్మలు విద్యుత్ తీగలకు తాకడంతో పాటు తీగలు తెగిపడే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు.

ప్రమాదాలు జరగక ముందే చర్యలు తీసుకోవాలి

తండాలోని గ్రామ పంచాయతీకి మోటార్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె తక్కువ ఎత్తులో కట్టించడం వల్ల వైర్లు చాల తక్కువ ఎత్తులో ఉన్నాయని మంచినీరు కోసం వచ్చిన గ్రామస్తులు బిందెలను ఎత్తుకొని పోయే సమయంలో చూడక ఆ బిందెలు కరెంట్ వైర్లకు తగిలితే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఎన్నో సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## ప్రభుత్వ వైద్యులకు సన్మానం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నేరేడుచర్ల ఇంటర్నేషనల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షులు యూషఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పున్నా నాగిని, డాక్టర్ శృతి ఆయుష్ లను శాలువాలతో సత్కిరంచి సన్మానించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ చల్లా ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరి సరికొప్పుల నాగేశ్వరరావు, రాచకొండ అంజయ్య, గుండా సత్యనారాయణ, వైద్య సిబ్బంది నర్సయ్య, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం



**ప్రజాపక్షం/కోదాడ:** మత్తు పదార్థాల వినియోగంలో యువత క్షీణించి వారి భవిష్యత్ అంధకారంగా మారుతుందని కోదాడ పట్టణ ఎస్‌ఐ సుధీర్ అన్నారు. గురువారం కోదాడ కెఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణ అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలను అరికట్టడం సమాజ శ్రేయస్సుకు అత్యవసరమన్నారు. ఇందులో యువత కీలక భూమికి పోషించాలన్నారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి అధ్యక్షతన వహించిన ఈ సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వేముల వెంకటేశ్వర్లు, పోలీస్ డ్రగ్స్ కమిటి సభ్యులు హుస్సేన్‌గౌడ్, అధ్యాపకులు నాగరాజు, పిచ్చిరెడ్డి, యాదగిరి, బల భీమ్‌రావు, రమేష్, రత్నకుమారి పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడిలో దూడ మృతి



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** వీధి కుక్కల దాటిలో గేదె దూడ మృతి చెందిన సంఘటన మేళ్లచెరువు మండలంలోని రేవూరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రంగా లక్ష్మి నారాయణ అనే వ్యక్తికి చెందిన లేగదూడ పక్కనే ఉన్న పొలంలో మేస్తుండగా వీధి కుక్కలు గుంపుగా దాడి చేసి పేగులు చిల్చి చంపేశాయని అంటున్నారు. పొలం వద్ద లేగదూడ మృతి చెంది ఉండటాన్ని చూసి రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. ఆ దూడ వెల సుమారు పదివేల వరకు ఉండవచ్చునని అంటున్నారు. ఈ దూడ లేని గేదె పాలు ఇవ్వదని దాని వల్ల రైతు ఆర్థికంగా ఎంతో నష్టపోవాల్సి వస్తుందని అంటున్నారు. కుక్కల భయంతో గ్రామ ప్రజలు భయంతో వనికి పోతున్నారు. కుక్కల భారీనుంచి ప్రజలను రక్షించడానికి ఏవైనా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్‌ను వేడుకుంటున్నారు.

## బకాయిలను విడుదల చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలో కళాశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో వేలాది మంది పేద బిసి విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నాయకులు సురేష్ నాయక్, గుండ బాచివర్మ, అనిల్, నరేష్, మౌనిక, సంధ్య, నవ్య, స్వాతి పాల్గొన్నారు.





## కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న నాలుగు కోర్టు కాంప్లెక్స్ బిల్డింగ్ పనులను సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా అక్కడ జరుగుతున్న పనుల తీరును, నిర్మాణంలో ఉన్న వివిధ విభాగాల గదులను, న్యాయస్థానాల రూపు రేఖలను ఆయన పరిశీలించి గుత్తేదారుకు తగు సూచనలు చేశారు. నిర్దిష్ట సమయం లోగా భవన నిర్మాణ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, దేవబత్తిని నాగార్జున, ఉపాధ్యక్షులు గట్ల నర్సింహరావు, సెక్రటరీ రామకృష్ణ, రంజాన్‌పాషా, రంగారావు, పెద్దబ్బాయి, కెవిరావు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం ఇసుక రీచ్‌లు



**ప్రజాపక్షం/అర్వపల్లి :** నిబంధనల ప్రకారం మన ఇసుక మన వాహనం రీచ్‌లు నడవాలని తుంగగూడెం రిచ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వల్లాల కోటి, నర్సింగ సమ్మయ్యలు అన్నారు. గురువారం తుంగగూడెం రీచ్‌లో నాగారం మండలం పేరబోయినగూడెం రిచ్ ట్రాక్టర్లు వచ్చి ఇసుక ఎత్తుతున్నారని ట్రాక్టర్ యజమానులు ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న అర్వపల్లి తహశీల్దార్ శ్రీకాంత్, ఎస్ఐ పి. మధులు రీచ్ వద్దకు వచ్చి విషయం తెలుసుకోగా పేరబోయినగూడెం రీచ్ వాళ్ళు వారి బాటను తొలగించి తుంగగూడెం రీచ్‌లో ఇసుక లోడింగ్ చేయడం సరైంది కాదని ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ట్రాక్టర్ యజమానులు, కూలీలు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని చీదెళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ కన్నంతరెడ్డి కృపాకర్ రెడ్డి (70) సైకిల్‌పై తన వ్యవసాయ భూమి దగ్గరకు వెళ్లి ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన వెన్న గోపి రెడ్డి కొత్త ట్రాక్టర్‌ను రాంబాబు అనే వ్యక్తి నడుపుతూ సైకిల్‌ను ఢీకొట్టడంతో పాటు ట్రాక్టర్ కృపాకర్ రెడ్డి తలపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.



# వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణోత్సవం

**ప్రజాపక్షం/భువనగిరి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను భక్తిశ్రద్ధలతో విశేషంగా నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని భక్తులకు కల్పించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారు బావి నుండి శ్రద్ధాభక్తులతో తీసుకువచ్చారు. అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన



పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3,000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు మృగ్యమవడంతో నిరుపేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మిర్యాలగూడ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆ పార్టీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు డైనింగ్ హాల్ లేకపోవడంతో చెట్ల కింద కూర్చొని తింటున్న అవస్థలను, వంటగదికి కప్పు లేక వంట కార్మికులు పడుతున్న ఇబ్బందులను వారు పరిశీలించారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు సుమారు 350 మంది పేద విద్యార్థులు చదువుతున్నారన్నారు. పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజన వంట పనివారికి సకాలంలో బిల్లులు చెల్లించాలని, వారికి ఇచ్చే 2000 రూపాయల జీతాన్ని పెంచి బడ్జెట్‌ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు మల్లు గౌతమ్రెడ్డి, మంగారెడ్డి, జగదీష్ చంద్ర, రామ్మూర్తి, లక్ష్మీ నారాయణ, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

# అక్రమ నీటి తరలింపును అధికారులు అడ్డుకోవాలి

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని కలకోవ గ్రామంలో చెరువు మధ్యలో గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు అక్రమంగా బావిని ఏర్పాటు చేసుకుని నీటిని తరలిస్తున్న విషయంలో రెవిన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని చెరువు నుండి అక్రమ నీటి తరలింపును అడ్డుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం కలకోవ చెర్వు నడిబోడ్డున గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు అతి పెద్ద క్రేన్ సహాయంతో బావి తీసి ఆ బావి నుండి దాదపు కిలోమీటర్ దూరం ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేస్తూ తమ పంట పొలాలనికి నీళ్లు పారించుకుంటూ తిరిగి మరల ఈ సంవత్సరం అదే చెరువులోని బావి సామార్థ్యం పెంచి తీసేందుకు క్రేన్ల సహాయంతో పని చేస్తుండగా చెరువు కింద పంట పొలాలను సేద్యం చేసుకుంటూ జీవనం వెల్లదీసుకుంటున్న 250 ఎకరాలకు చెందిన సదరు రైతులు స్థానిక సర్పంచ్ మండవ వెంకటాద్రికి చెరువులో అక్రమ నీటి తరలింపుకు బావి సామార్థ్యం పెంపుపై ఫిర్యాదు చేసిన ఆయన సహాయంతో అధికారులకు సమాచారం అందించారన్నారు.

# బిసి కళాకారుల ప్రదర్శన మేళాకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బోనాల పండుగ సందర్భంగా జులై 16 నుండి 26 వరకు (11 రోజులు) హైదరాబాద్‌లోని హెచ్ఎండిఏ గ్రౌండ్స్‌లో బిసి కళాకారుల ప్రదర్శన కమ్ అమ్మకపు మేళాలో పాల్గొనదలిచిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విశాల్ ధార గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 100 స్టాల్స్ ఏర్పాటు చేయబడుతాయన్నారు. కుండల తయారీదారులు, వెదురు కళాకారులు, ఇనుము, చెక్క కళాకారులు, నీరా ఉత్పత్తిదారులు, చేనేత కళాకారులు, తెలంగాణ సాంప్రదాయ ఆహార ఉత్పత్తిదారులు, తదితర అర్హులైన బిసి వృత్తి కళాకారులకు తమ ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించుకునే అవకాశం కల్పించబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అర్హులైన బిసి వృత్తి కళాకారులు, హస్తకళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొనదలచినట్లయితే అట్టి వివరాలతో ఈనెల 8న సూర్యాపేట జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో జరుగు సమావేశానికి హాజరు కావాలని సూచించారు. ఎంపికైన ప్రతి స్టాల్‌కు ఇద్దరు ప్రతినిధులకు జిల్లా నుండి హైదరాబాద్ వరకు ఒక వైపు రవాణా సౌకర్యం, 11 రోజులపాటు వసతి, టీ, అల్పాహారం, మధ్యాహ్న, రాత్రి భోజనం ఉచితంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో కల్పించబడుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన అర్హులైన బిసి వృత్తి కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఉత్పత్తులను విక్రయించుకోవాలని కోరారు.

## బిఎల్‌వోగా విధులు నిర్వహించలేను

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పాలవరం తండా గ్రామానికి చెందిన విజయ బిఎల్‌వోగా విధులు నిర్వహిస్తున్నది బిఎల్‌వోగా విధులు నిర్వహించలేనంటూ డిప్యూటి తహసిల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. గురువారం స్థానిక సర్పంచ్ భూక్య నారాయణ విధులకు ఆటంకం కలిగిస్తూ తనకు నచ్చినట్టుగా సర్వే చేయాలని బెదిరించడమే కాకుండా అవమానకరంగా దూర్భషలాడుతూ అవమానిస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకంగా నాపై ఒత్తిడి చేయడం వల్ల బిఎల్‌వో విధుల నుండి తనను తొలగించాలని మండల డిప్యూటి తహసిల్దార్ కు తన రాజీనామా పత్రంను అందించినట్లు తెలిపారు.

# కృష్ణానది, పులిచింతల రిజర్వాయర్ పరిధిలో చేపల వేట నిషేధం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జులై 1 నుండి ఆగష్టు 31 వరకు కృష్ణా నది, పులిచింతల రిజర్వాయర్ పరిధిలో చేపల వేట పూర్తిగా నిషేధించబడిందని జిల్లా మత్స్యశాఖ అధికారి డి. ఆంజనేయస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చేపల సంతానోత్పత్తి కాలాన్ని పరిరక్షించడం, చేపల సంపదను అభివృద్ధి చేయడం, జలవనరుల స్థిరమైన వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా నిషేదించినట్లు పేర్కొన్నారు. ఈ నిషేధిత కాలంలో మత్స్యకారులు ఎలాంటి వలలు, పడవలు లేదా ఇతర చేపల వేట పరికరాలను ఉపయోగించి చేపల వేట చేపట్టరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై అమలులో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోబడునని హెచ్చరించారు. మత్స్యకారులు, మత్స్య సహకార సంఘాల సభ్యులు, ప్రజలు ఈ నిషేధాన్ని స్వచ్ఛందంగా పాటించి, చేపల సంపద పరిరక్షణకు సహకరించాలని కోరారు.

## విద్యా సంస్థల బంద్ విజయవంతం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. గురువారం నల్గొండ జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా బీసీ విద్యా సంఘం నాయకులు గాదగోని మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇతర అన్ని రకాల ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థలను మూసివేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సంఘం ప్రతినిధులు విద్యా సంస్థల ఎదుట నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా గాదగోని మహేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగాన్ని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలేజీల విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార కేంద్రాలుగా మార్చితే ఊరుకోం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థుల తల్లిదండ్రుల కష్టార్జితాన్ని పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరిట దోచుకుంటున్న ప్రైవేటు పాఠశాలల అక్రమ వ్యాపారాలపై విద్యాశాఖ అధికారులు నిఘా పెట్టాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు విద్యాసంస్థలు యథేచ్ఛగా సాగిస్తున్న వ్యాపార ధోరణిని నిరసిస్తూ గురువారం బీసీ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ ధరల కంటే ఎక్కువ రేట్లకు పుస్తకాలు, బూట్లు, దుస్తులను పాఠశాల ప్రాంగణాల్లోనే విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా కుంగదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్క నాగేశ్వరరావు, బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ సిద్ధం రాజు, యువజన సంఘం నియోజకవర్గ నాయకులు మునగల శైలేందర్, బీసీ యువజన సంఘం పట్టణ కన్వీనర్ పట్టేటి రమేష్, బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి ఉపేందర్, రమేష్, శంకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అవార్డులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు 2026ల ఎంపికకు గాను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె. అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 10 చివరి తేదీ అని పేర్కొన్నారు. జిల్లాలో అర్హత గల ఉపాధ్యాయులందరూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయు ల ఎంపిక కొరకు వారి వారి ధృవీకరణ పత్రములతో నేషనల్‌అవార్డ్స్ టు టీచర్స్ ఎడ్యుకేషన్ పోర్టల్ నందు వ్యక్తిగతంగా అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

## సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)** : మండలంలోని రహీంఖాన్ పేట స్టేజి వద్ద అన్ని డిపోలకు చెందిన బస్సులను ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం తెలిపారు.ధర్నా కార్యక్రమానికి చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు హాజరుకావాలనీ కోరారు.

## దివ్యాంగులకు చేయూత సామాజిక బాధ్యత



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** దివ్యాంగులకు చేయూతనివ్వడం సామాజిక బాధ్యతనీ మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు. టీ ఆర్ ఫౌండేషన్ అధినేత పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ ఆధ్వర్యంలో పుట్టినరోజు సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు పాస్ మేళాలో దాదాపు 100 మంది దివ్యాంగులకు బస్సు పాసులను అందజేశారు. మేళాకు హాజరైన వారంతా తడక రమేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ సూరేపల్లి రాధిక రమేష్ రాపోలు కావ్య వేణు టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్ భోగ విష్ణు ఆర్టీసీ అధికారి పెండెం పాండురంగం చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండురంగం రాపోలు శ్రీనివాస్ కుడికాల బాల నరసింహ చిక్క చందు తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహానికి నివాళులు



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన బందెల లింగస్వామి అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఉత్తటూరు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం అందించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి, నాయకులు కోళ్ల కిషన్, జెట్టి సైదులు, పోతుల స్వామి, మేడి రాజు, శీను పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో యెల్లంల సంజీవరెడ్డి

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూరు మండలంలోని చామాపూర్ కు చెందినతోడిగెల సురెందర్ రెడ్డి కుమార్తే వివాహం మూత్తిరెడ్డి గూడెం గ్రామంలోని ఎ కే ఆర్ కన్వెన్షన్ హాల్లో జరుగగా కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర నాయకులు యేల్లంల సంజీవ రెడ్డి పాల్గోని నూతన వదూవరులను ఆశీర్వాదించారు.



# లావణ్య హాస్పిటల్ వైద్య సేవలను సద్వినియోగం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లావణ్య హాస్పిటల్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీలావణ్య హాస్పిటలను గురువారం నగ ర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నారని నల్లగొండలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లావణ్య హాస్పిటల్ లో అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు అందించే నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని ప్రజలంతా ఆరోగ్యంగా జీవించాలని ఆమె ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ లావణ్య, రవి ప్రసాద్, శ్రావణ్ కుమార్, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అశ్రఫ్ అలీ అమేర్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసిలు గుమ్ముల మోహన్ రెడ్డి,వంగూరి లక్ష్మయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్ల శ్రీనివాస్,కార్పొరేటర్లు,కాంగ్రెస్ నాయకులు కేసాని వేణుగోపాల్ రెడ్డి,ఆల్లి సుభాష్ యాదవ్, రేగటి లింగ స్వామి గౌడ్,ఆల్లి మల్లికార్జున్ పాల్గొన్నారు.

# విద్యార్థులలో అభ్యసనా సామర్ధ్యాన్ని పెంపొందించాలి



**ప్రజాపక్షం/చిట్యాలః** విద్యార్థులలో అభ్యసనా సామర్ధ్యాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి(ఎస్‌సిఈఆర్‌టి) డైరక్టర్ రమేష్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్, ప్రీ ప్రైమరీ పాఠశాలలను గురువారం రోజున జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావుతో కలిసి సందర్శించారు. 50 శాతం మంది విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, గణిత పాఠ్యాంశాలలో వెనుకబడి ఉండటాన్ని ఆయన గుర్తించిన అనంతరం మాట్లాడుతూ విద్యాభ్యాసంలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసి వృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులకు డిజిటల్ లెర్నింగ్‌తో పాటు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేసి వారిలో అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపరచాలన్నారు. ప్రీ ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించి భోజన విరామం అనంతరం పిల్లలకు ఆటల, పాటల ద్వారా సృజనాత్మక కార్యకలాపాల ద్వారా ఆనందదాయక అభ్యసనాన్ని అమలు చేయాలని రమేష్ సూచించారు. వీరి వెంట మండల విద్యాధికారి సైదానాయక్ ఉన్నారు.

# పెండింగ్ రూ.10వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని నమ్మించి, నేడు గద్దె నెక్కాక నిరుపేద పిల్లలు చదువుకోవడానికి పైసలు ఇవ్వడానికి మనసు రావడం లేదని బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ అన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలని కోరుతూ బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిధిలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ కాలేజీ యాజమాన్యాలు పూర్తి ఫీజులు కడితేనే విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని ఇబ్బందులు పెడుతున్నాయని, ఈ చేతకాని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత చదువులు చదవడం ముఖ్యమంత్రికి ఇష్టం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో నిలిచిపోయిన రూ.10వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ మహిళ సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు ఎస్ పి నాయుడు, బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి నక్క నాగరాజు ముదిరాజ్, యస్సి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చిత్రం ఉమా, ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు శంకర్ పాల్గొన్నారు.

## కరపత్రం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట పట్టణ కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్స కరపత్రం ఆవిష్కరణకు ముఖ్య అతిదులుగా గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉపసర్పంచ్ మోటె రమేష్ ఆవిష్కరించారు. అనంతరం ఆలయ చైర్మన్ లవణం ఉపేందర్ మాట్లాడుతూ నాలుగో తారీఖు శనివారం బ్రహ్మోత్సవ అంకురార్పణ ప్రత్యేక పూజల, ధ్వజారోహణ అనంతరం హోమము నిర్వహించబడును.ఆదివారం ఐదో తారీకు రోజున స్వామి వారికి ప్రత్యేక పూజలు 11 గంటల 15 నిమిషాలకు శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించబడును. అనంతరం ఒంటిగంటకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుంది. సోమవారం ఆరో తారీఖు తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో రామన్నపేట మండల మరియు పట్టణ ప్రజలు పెద్దాయత్తున పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సాల్వేర్ అశోక్, జెల్ల వెంకటేష్, గోదాసు సుగ్రీవులు, ఊట్కూరు నరసింహ, వనం అంజయ్య, కోట సుధాకర్, పూజారి శ్రీనివాస్ ఆచార్యులు, భూసాని యాదగిరి, రాధా కిషన్, వార్డు సభ్యులు సుర్వి హరిబాబు, ఊట్కూరు శీను, ఆలయ కమిటీ భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కోసం ఎదురుచూపులు

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వసంతాపురం గ్రామం తెల్లబండతండా ఆవాసముకు చెందిన గుగులోతు సైది గత 12 సంవత్సరాల నుండి ప్రభుత్వ సహయ ద్వారా ఇల్లు నిర్మించుకోవడానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం నందు పలుమార్లు విన్నవించుకోవడం జరిగిందని, అయినప్పటికీ మాకు అప్పటి నుండి ఇల్లు రాలేదని, ప్రస్తుత నేటి ప్రభుత్వమైన కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి విడతలో ఇల్లు మంజూరుకు వెరిఫికెషన్ ప్రక్రీయ పూర్తి కావడం జరిగిందని, నేటి వరకు ఎలాంటి ప్రొసీడింగ్స్ అనేది ఇవ్వలేదని, ఎన్నో సంవత్సరాల నుంచి నిరీక్షణగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం చూస్తున్నా ఇల్లు నిర్మించడం కోసం స్థలం ఏర్పాటు చేసుకోవడం జరిగిందని సైది పేర్కొన్నారు. జూన్ 2 ఇళ్ల నిర్మాణం కోసం అనుమతులు ఇస్తున్నారని ఉద్దేశ్యంతోటి అప్పుచేసి ఇల్లు నిర్మాణ సామాగ్రి తీసుకరావడం జరిగిందని, కాని నేటి వరకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, ఈ విషయంపై కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చొరవ తీసుకుని మొదటి విడతలో భాగంగా మంజురైన ఇళ్లకు కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వాలని విలేకరుల ముందు వాపోయింది.

## డిఇఇపై చర్యలు తీసుకోవాలని వినతి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థల దోపిడికి సహకరిస్తున్న డిఈఓ అశోక్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో విద్యను వ్యాపారంగా చేసుకొని డబ్బే ధ్యేయంగా పెట్టుకొని ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులను వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉత్తర్వులను, కోర్టు ఆదేశాలను దిక్కరిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. ఫీజుల దోపిడి సరిపోనట్లు అదనంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, బెల్టు, టై, షూ, బ్యాగ్ తదితర వస్తువులను పాఠశాలలోనే కొనాలని హుకూం జారీ చేస్తూ వేలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి దండుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పిఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి, జనసేవా సమితి అధ్యక్షులు తగుళ్ల జనార్ధన్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి పిడమర్తి భరత్‌లు పాల్గొన్నారు.

## విబి జి రామ్ జి బిల్లు రద్దు చేయాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విబి జి రామ్ జి బిల్లు 2025 రద్దు చేయాలనీ కోరుతూ గురువారం ఎన్‌పిఆర్‌డి పోచంపల్లి మండల సెంటర్లో మండల్ కమిటీ ఆధ్వర్యంలో ప్లే కారడ్స్ తో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుండి అమలు చేస్తున్న వి బి జి రామ్ జి 2025 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలనుండి కేంద్ర ప్రభుత్వంగ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ నుండి టి.వెంకటేశం, ఎన్‌పిఆర్‌డి డివిజన్ అధ్యక్షులు శివయ్య, ఎన్‌పిఆర్‌డి పోచపల్లి మండల్ అధ్యక్షులు రాములు, మండల కార్యదర్శి పాము కుంట వెంకటేష్, కుమ్మరి మహేందర్, ఉపాధ్యక్షురాలు ఇందిరమ్మ పాల్గొన్నారు.



# గ్రంథాలయ సెస్ చెల్లించాలి: చైర్మన్

## సిబ్బంది కొరతపై సంచాలకులకు ప్రతిపాదనలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు గ్రంథాలయ సెస్‌ను సకాలంలో చెల్లించిగ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్ కోరారు.గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థలో చైర్మన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు.గ్రంథాలయాల అభివృద్ధి,సిబ్బంది సమస్యలు,నిర్వహణపై సభ్యులతో చర్చించారు.గత సమావేశ నిర్ణయాల అమలుపై సమీక్షించారు.జిల్లా గ్రంథాలయ సంస్థలో ఏడుగురు సిబ్బంది పదవీ విరమణతో తీవ్ర కొరత ఏర్పడింది.కలెక్టర్ గెజిట్ ప్రకారం 6 గ్రంథపాలకులు,2 లైబ్రరీ హెల్పర్ల నియామకానికి పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులకు ప్రతిపాదనలు పంపేందుకు ఆమోదించాం అని చైర్మన్ తెలిపారు.పదవీ విరమణ పొందిన సిబ్బంది కాలంలో పోయిన పుస్తకాల రద్దు ప్రతిపాదనలు 2025/26,2026/27 సంవత్సరాలకు సంచాలకులకు పంపేందుకు ఆమోదం తెలిపారు.పని వేళలు,వేతనాల పెంపు అనంతర చర్యలపై కూడా తీర్మానం చేశారు.మొత్తం 5 ఎజెండా అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.సమావేశంలో కార్యదర్శి బాలమ్మ, విద్యాశాఖ సీఎంఓ కత్తుల రవీందర్,వయోజన విద్యాధికారి దుర్గాప్రసాదరావు,ఏపీఆర్ఓ బి.భీమేష్, డీపీఓ వెంకటేశ్వర్లు,లైబ్రరీ ఇంచార్జి రాజేష్, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## అధిక సాంద్రత పత్తి విత్తనాలు పంపిణీ

**ప్రజాపక్షం/చండూరు :** మండలం బంగారిగడ్డ రైతు వేదిక వద్ద గురువారం కాటన్ కపాస్ కాంతి పథకం కింద అధిక సాంద్రత పత్తి విత్తనాలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు,సర్పంచ్ సునీత శ్రీనివాస్ చేతుల మీదుగా విత్తనాలు అందజేశారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మల్లేష్ మాట్లాడుతూ ఈ విత్తనాలు కచ్చితంగా విత్తే రైతులకే. ఇప్పటికే విత్తిన రైతులు తీసుకోవడానికి వీల్లేదు.అధిక సాంద్రత పత్తి సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఆధార్ కార్డు,పాస్ పుస్తకం,వాంగ్మూలంతో గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలి.ఒక్కో రైతుకు ఒక ఎకరానికే విత్తనాలు ఇస్తాం.విత్తిన పంటలను అధికారులు పర్యవేక్షిస్తారు.జియో ట్యాగింగ్ చేస్తాం. కాబట్టి విత్తే రైతులే తీసుకోవాలి అని స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భూతరాజు ఆంజనేయులు,తలారి నరసింహ, ధోని, పాముల బోడంగిపర్తి సర్పంచులు,ఏఈఓ పవన్, రైతులు పాల్గొన్నారు.




## పిఆర్‌సి ప్రకటించకపోతే సమరమే

**ప్రజాపక్షం/నాంపల్లి :** పీఆర్‌సి రిపోర్టు ప్రకటించకపోతే,పెండింగ్ డీఏలు,బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం తప్పదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నరసింహ హెచ్చరించారు.గురువారం నాంపల్లి మండలంలోని నాంపల్లి,పసునూరు,ముష్టిపల్లి, గట్లమల్లేపల్లి, మహమ్మదాపురం ఉన్నత పాఠశాలలు,పెద్దాపురం ఆదర్శ పాఠశాల,కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గేర నరసింహ మాట్లాడుతూ జూలై మొదటి వారానికే పీఆర్సీ రిపోర్టు తెప్పించి మంచి ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేపట్టాలి. ప్రతి ఊరిలో స్కూల్ ఉంటుందని చెప్పి,27 వేల పాఠశాలలను 4వేలకు కుదిస్తామనడం సమంజసం కాదు. ఇది విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడమే.కుదింపు చర్యలు వెంటనే నిలిపివేయాలి అని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జింకల సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి కస్పరాజు వెంకన్న, ఉపాధ్యక్షుడు పల్లేటి వెంకటయ్య,కోశాధికారి శ్రవణ్ కుమార్, యాదయ్య,మహేశ్వరం వెంకటేశ్వర్లు,దొడ్డి నరసింహ,బక్క దివంత,గ్యార సంపత్,గాదపాక వేలాద్రి పాల్గొన్నారు.

## హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలం రేవెల్లి గ్రామంలో పలుమార్లు మోటార్ మరమ్మతులకు గురై తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరట లభించింది. గ్రామపంచాయతీ పాలక వర్గం చొరవతో కొత్త మోటర్ ఏర్పాటు చేయడంతో తాగునీటి సమస్య తీరింది.ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పాలకవర్గం తక్షణమే స్పందించి కొత్త మోటర్ బిగించింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బట్టు శ్రీనివాస్ యాదవ్,ఉప సర్పంచ్ వంగూరు సాయిలు,వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ వర్కర్లు,శిరముని సత్తయ్య, బట్టు గిరి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రారంభమైన రేషన్ బియ్యం పంపిణీ



**ప్రజాపక్షం/నందికొండ:** మూడు నెలల విరామ అనంతరం రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ జూలై నెల నుంచి తిరిగి ప్రారంభమైంది. ఏప్రిల్ నెలలో ప్రభుత్వం ఏప్రిల్,మే,జూన్ నెలలకు సంబంధించిన మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేసిన విషయం తెలిసిందే.దీంతో జూన్ నెల వరకు ప్రత్యేకంగా బియ్యం పంపిణీ చేపట్టలేదు.జూలై నెల ప్రారంభం కావడంతో ప్రస్తుతం సాధారణ విధానంలో రేషన్ బియ్యం పంపిణీ కొనసాగుతోంది. కుటుంబంలోని ప్రతి సభ్యునికి గతంలో మాదిరిగానే ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున బియ్యం అందజేస్తున్నారు.ఇటీవల ఒక్కో వ్యక్తికి 6 కిలోల బదులుగా 7కిలోల చొప్పున రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది.అయితే,అలాంటి నిర్ణయం ప్రభుత్వ స్థాయిలో తీసుకోలేదని,ప్రస్తుతం ఎలాంటి అధికారిక ఆదేశాలు అందలేదని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు.ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకుండా,ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని అధికారులు సూచించారు.ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల ప్రకారమే రేషన్ బియ్యం పంపిణీ కొనసాగుతుందని వారు తెలిపారు.

## ఓటర్లకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు..



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా అప్లికేషన్ల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది . అప్లికేషన్లు అందుకున్న ప్రతి ఓటరు వాటిని పూర్తిగా నింపి నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్‌వోలకు తప్పనిసరిగా సమర్పించాలని పెద్దవూర మండల రెవెన్యూ ప్రోటోకాల్ ఆఫీసర్, ఆర్ ఐ దండ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అప్లికేషన్ నింపే విషయంలో ఓటర్లకు ఎలాంటి సందేహాలు ఉన్నా పెద్దవూర ఎమ్మార్వోఖాసీం నాయక్ ఆదేశాల మేరకు స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఈ సదుపాయాన్ని మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఓటరు వినియోగించుకుని తమ దరఖాస్తులను సక్రమంగా పూర్తి చేయాలని ఆయన కోరారు.ఇప్పటికీ ఎస్ఐఆర్ ఫారమ్ అందని ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వెంటనే సంబంధిత బీఎల్‌వోను లేదా స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.అప్లికేషన్లు సమర్పించని పక్షంలో ఓటరు జాబితాలో పేరు కొనసాగింపుపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించి గడువులోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి మంచి సహకారం లభిస్తుండటంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం సజావుగా,చురుగ్గా కొనసాగుతుండటం సంతోషకరమని దండ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్




**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలంలో తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగినది.తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం ఇవ్వాలని చలో భూదాన్ కార్యక్రమానికి టిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపుమేరకు రామన్నపేట తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే చాంద్, మండల అధ్యక్షులు నోముల శంకర్, మండల ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఇమామ్ ఉన్నారు.

## పత్తి విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండల వ్యవసాయ అధికారి ఏవో లక్పతి నాయక్ గురువారం మండల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పత్తి విత్తనాలను పంపిణి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పత్తి విత్తనాలకు సంబంధించి మండలానికి 7650 ప్యాకెట్ల పత్తి విత్తనాలు రావడం జరిగిందని, గురువారం ఒక్క రోజే 111 మంది రైతులకు 1200 పత్తి విత్తనాల ప్యాకెట్లను ఉచితంగా అందజేయడం జరిగింది తెలిపారు. ఈసందర్భంగా వ్యవసాయ అధికారి లక్పతినాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను అందజేయడం జరుగుతుందని పత్తి విత్తనాలు అవసరమున్న రైతులు చందంపేట మండల రైతు వేదికలో పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు తీసుకువచ్చి విత్తనాలను పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సాధిక్, బద్యనాయక్, రాములు, శ్రీనయ్య, సాంబయ్య, చెన్నయ్య, వెంకటయ్య, సైదులు పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ప్రజాపక్ష/త్రిపురారం:** మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు ఉందని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లంపల్లి జానయ్యఅన్నారు. గురువారం సత్యం పాడు తండాలో మహిళా సమైక్య భవనాన్ని పదిలక్షల రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్విని చేసుకోవాలని అన్ని రంగాలలో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సలహాదారుడు అనుముశ్రీనివాసరెడ్డి,కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి,సర్పంచ్ ఇస్లావదు పావని, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పద్మ, వీరయ్య,మైలారిశెట్టి సైదయ్య,హనుమంతు పాల్గొన్నారు.

